# గుట్టలో వైభవంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపించారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపించారు.



పాతగుట్టలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు

# పంటకు పెట్టుబడేది?



## రైతుబంధు కోసం ఎదురుచూపు

జిల్లా వ్యాప్తంగా 5.42 లక్షల మంది రైతులు.. రావాల్సినది రూ.624 కోట్లు

ఇప్పటి వరకు ఇచ్చింది 1.14 లక్షల మందికి రూ.26.94 కోట్లు మాత్రమే..

గత యాసంగిలో తొలి రోజే రూ.43 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

**యాసంగి సీజన్ రైతు బంధు సాయం కోసం రైతాంగం ఎదురు చూస్తున్నది. సీజన్ ఇప్పటికే ప్రారంభం కాగా కొత్త ప్రభుత్వం ఈ నెల 10 నుంచి పెట్టుబడి సాయం ఇవ్వడం షురూ చేసింది. కానీ.. అందరికీ డబ్బులు పడకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. జిల్లాలో 5.42 లక్షల మంది రైతులకు రూ.624 కోట్ల పెట్టుబడి సాయం రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 1.14 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.26.94 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. గత యాసంగిలో కేసీఆర్ ప్రభుత్వం తొలి రోజే 1.41 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.43 కోట్లు జమ చేయగా.. ఈ సారి పది రోజులైనా రూ.26కోట్లు మాత్రమే రైతుల అందాయి.**



### పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం..

పంట పెట్టుబడి కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో ఎకరానికి 5 వేల రూపాయలు రైతులందరి ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. ఈ యాసంగి సీజన్‌కు కూడా రైతు బంధు ఇచ్చే ప్రయత్నం చేయగా, కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. అయితే.. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.7500 చొప్పున ఏడాదికి రూ.15వేలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దాన్ని అమలు చేయడంలేదు. పాత పద్ధతిలోనే ఎకరానికి రూ.5వేలు ఇస్తున్నది. ఈ నెల 3న కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఈ నెల 10నుంచి రైతు బంధు ఇస్తామని చెప్పి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం ప్రారంభించింది. కానీ.. జిల్లా వ్యాప్తంగా 5,42,406 మంది రైతులకు రూ.624,14,84,629 పెట్టుబడి సాయం ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 1,14,542 మంది రైతులకు రూ.26,94,65,516 మాత్రమే జమ చేసింది. ఒక గుంట జాగా నుంచి ప్రారంభం చేసి ఇప్పటి వరకు ఎకరం భూమి ఉన్న వారికి జమ చేసినట్లు తెలుస్తున్నది.

### గత యాసంగిలో తొలి రోజే రూ.43 కోట్లు..

కేసీఆర్ ప్రభుత్వం గత యాసంగి సీజన్‌లో తొలి రోజే రూ.43కోట్లు రైతుల ఖాతాల్లో రైతు బంధు జమ చేయగా.. ఈ సారి పది రోజులైనా రూ.26కోట్లు మాత్రమే పడ్డాయి. అప్పుడు మొత్తం 1.41 లక్షల మందికి 86,531 ఎకరాలకు సంబంధించి రైతు బంధు ఇచ్చింది. ఇప్పుడు ఈ పది రోజుల్లో 1.14 లక్షల మందికి 52,500 ఎకరాలకు మాత్రమే పడ్డాయి. దాంతో గత యాసంగిలో బీఆర్ఎస్ ప్రభుత్వం జమ చేసిన రైతు బంధు కంటే ఈ సారి చాలా ఆలస్యంగా రైతుల ఖాతాల్లో జమ అవుతుండటంతో తమకు ఎప్పుడు వస్తాయోనని పెద్ద రైతులు ఆందోళన చెందుతున్నారు.

### రైతుల ఖాతాల్లో రూ.26.94 కోట్లు జమ



యాసంగి సీజన్‌కు సంబంధించి రైతు బంధు డబ్బును ప్రభుత్వం ఈ నెల 10నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది. జిల్లాలో 5,42,106 మంది రైతులకు పెట్టుబడి సాయం రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,14,542 మంది ఖాతాల్లో రూ.26,94,65,516 జమ అయ్యాయి. మిగిలిన రైతులకు కూడా వేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. గతంలో వేసిన విధంగానే ఈ సారి కూడా ఎకరానికి ఐదు వేల రూపాయల చొప్పున జమ అవుతున్నాయి.

– శ్రవణ్‌కుమార్, నల్లగొండ డీపీఓ

### రైతు బంధు కోసం ఎదురుచూస్తున్న



నేను ఐదెకరాల్లో పొలం పెట్టా. విత్తనాల కోసం కావాల్సిన డబ్బులు బయట తీసుకొచ్చినప్పటికీ ఇంకా నాటు వేసిన కూలోల్లకు ఇవ్వలేదు. దాంతో పాటు ఎరువులకు కూడా డబ్బులు కావాలి. రైతు బంధు వస్తదంటే దాని కోసమే ఎదురు చూస్తున్న. ఎప్పుడు సెల్లుకు మెసేజీ వస్తదేమోనని చూస్తున్న. డబ్బులు పడగానే ఎరువులు తీసుకొని రావాలి.

– బైరగోని జానయ్య, రైతు, చిన్నాయిగూడెం, తిప్పర్తి మండలం

# ఆటో కార్మికులకు జీవన భృతి కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు చాపల శ్రీను

మునుగోడు, డిసెంబర్ 21 : ఆటో కార్మికులకు తగిన న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు చాపల శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆటో కార్మికులతో కలిసి గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటోలు నడుపుతున్న వారికి పూట గడవని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు నెలకు రూ.15వేలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జానీమియా, బండారు శంకర్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.




మునుగోడులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

# పక్కాగా హాజరు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్‌తో అటెండెన్స్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 కాలేజీల్లో అమలు
- విజయవంతంగా కొనసాగుతున్న ప్రక్రియ
- హాజరు నమోదు చేసుకుంటున్న 675మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది



*ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది సమయపాలన, హాజరు శాతం పెంచడమే లక్ష్యంగా బయోమెట్రిక్ విధానానికి విద్యాశాఖ చర్యలు తీసుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఈ విధానం అమలు చేస్తుండగా, విజయవంతంగా కొనసాగుతున్నది. నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 675 మంది బోధన, బోధనేతర సిబ్బంది నిత్యం బయోమెట్రిక్‌లో హాజరు వేస్తున్నారు. దీంతో అధ్యాపకులు, సిబ్బంది సమయ పాలన పాటింపు, హాజరు శాతం పెరిగింది.*

రామగిరి, డిసెంబర్ 21 : జూనియర్ కాలేజీల్లో సమయ పాలన, హాజరు నమోదుపై దృష్టి పెట్టిన విద్యాశాఖ.. 2016–17లో విద్యార్థులతో పాటు అందరికీ బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెట్టింది. అయితే.. సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అందులోని సమస్యలకు పరిష్కారం చూపుతూ 2022–23 విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నూతన ఆధునిక టెక్నాలజీతో అనుసంధానం చేసిన బయోమెట్రిక్ మిషన్లు అందజేశారు. దాంతో 2023–24 విద్యా సంవత్సరంలో జూన్‌లో విద్యాసంస్థలు ప్రారంభమైన నాటి నుంచి రోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు కళాశాలల్లో అధ్యాపకులు, సిబ్బంది ఉంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో బోధన, బోధనేతర సిబ్బంది వివరాలు**

| జిల్లా | కళాశాలలు | అధ్యాపకులు (రెగ్యులర్) | గెస్ట్ లెక్చరర్స్ | నాన్ టీచింగ్ స్టాఫ్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| నల్లగొండ | 12 | 185 | 60 | 50 | 295 |
| సూర్యాపేట | 07 | 98 | 42 | 35 | 175 |
| యాదాద్రి | 11 | 147 | 30 | 28 | 205 |
| మొత్తం | 30 | 430 | 132 | 113 | 675 |

### ఉమ్మడి జిల్లాలో విజయవంతంగా కొనసాగింపు

నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు విజయవంతంగా కొనసాగుతున్నది. నిత్యం ప్రభుత్వం, ఇంటర్ విద్యాశాఖ సూచించిన సమయంలోనే హాజరవుతున్నారు. బయోమెట్రిక్‌తో రోజూ 6గంటల పాటు కళాశాలల్లోనే ఉండాల్సి ఉంటుంది. అంతకు తక్కువ సమయంలో బయోమెట్రిక్ వేస్తే ఒక పూట హాజరు పడుతుంది. కాబట్టి అంతా కచ్చితంగా సమయం పాటిస్తున్నట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వెల్లడిస్తున్నారు. అదేవిధంగా తరగతుల నిర్వహణ సైతం టైంటేబుల్ ప్రకారం కొనసాగుతున్నట్లు చెప్తున్నారు.

### ఆదేశాలను పటిష్టంగా అమలు చేస్తున్నాం



ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలను పటిష్టంగా అమలు చేస్తున్నాం. వారు సూచించిన విధంగానే 2023 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు విధులకు అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది సమయానికి వచ్చి బయోమెట్రిక్‌లో వేలిముద్రతో హాజరు వేస్తున్నారు. అటు విద్యతోపాటు ఇటు కార్యాలయంలో జరుగాల్సిన పనులు సమయ పాలనతో సాగుతున్నాయి. అంతేకాకుండా ఏ కళాశాలలో ఎవరు వచ్చారో ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం ఉన్నది. దీంతో అధ్యాపకులు సమయం పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నారు.

– దస్రూనాయక్, డీఐఈఓ, నల్లగొండ

### అందరూ సమయపాలన పాటిస్తున్నారు



ప్రత్యేకంగా బోధన, బోధనేతర సిబ్బందికి ఇంటర్ విద్యాశాఖ అందించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సహాయంతో నిర్ణీత సమయంలో మా కళాశాలలో హాజరు వేస్తున్నారు. రెగ్యులర్, కొంత మంది కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీతోపాటు బోధనేతర సిబ్బంది కూడా ఉదయం, సాయంత్రం వేళ కచ్చితంగా 6గంటల సమయం కాలేజీలో ఉంటూ బయోమెట్రిక్ మిషన్‌తో హాజరు వేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులు చూసే అవకాశం ఉండడంతో అందరిలో కాస్త భయంతో సమయ పాలన పాటిస్తున్నారు. మరో వైపు తమకు కేటాయించిన సమయంతోపాటు అదనపు సమయం విద్యార్థులకు కేటాయిస్తూ అధ్యాపకులు అందుబాటులో ఉంటున్నారు.

– కలకోట నరేంద్ర, ప్రిన్సిపాల్, కేపీఎం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, నల్లగొండ

### పెరుగుతున్న హాజరు.. పటిష్టంగా తరగతుల నిర్వహణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు విధానం తేవడంతో బోధన, బోధనేతర సిబ్బంది సమయ పాలన పాటించడంతోపాటు హాజరు శాతం పెరిగింది. గతంలో ఆలస్యంగా వచ్చినా రిజిస్టర్‌లో సంతకం చేసేవారు. ఇప్పుడు అలాంటి అవకాశం లేకపోవడంతో కచ్చితంగా అందరూ ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు సమయం కేటాయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బయోమెట్రిక్‌లో విధిగా హాజరు వేస్తున్నారు. బయోమెట్రిక్ హాజరుతో ప్రిన్సిపాల్ నుంచి అధ్యాపకులు, కింది స్థాయి సిబ్బంది వరకు సమయపాలన పాటిస్తుండడంతో విద్యార్థులకు సమయానుకూలంగా తరగతుల నిర్వహణ సాగుతుంది. పర్యవేక్షణ పెరుగడంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

# సజావుగా డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

రామగిరి, డిసెంబర్ 21 : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ 1, 5 పరీక్షలు సజావుగా జరిగినట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు. గురువారం తెలుగు పరీక్షలు జరిగాయని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరుగకుండా వర్సిటీ పరీక్షల విభాగం నుంచి అన్ని పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షణ చేసినట్లు చెప్పారు.

# ఎఫ్‌సీఐ డీఎంగా సుశీల్ కుమార్‌సింగ్

నల్లగొండ, డిసెంబర్ 21 : భారత ఆహార సంస్థ డివిజనల్ మేనేజర్‌గా సుశీల్‌కుమార్ సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఎఫ్‌సీఐ నల్లగొండ డివిజనల్ కార్యాలయ మేనేజర్‌గా పని చేస్తున్న వరుణ్‌కుమార్ సూద్‌ను గుజరాత్ ప్రాంతీయ కార్యాలయానికి బదిలీ చేయగా, నూతన మేనేజర్‌గా ఒడిశాలోని కటక్ జిల్లా డివిజనల్ మేనేజర్‌గా పని చేస్తున్న సుశీల్ కుమార్‌సింగ్‌ను నల్లగొండ డీఎంగా నియమించారు. అయితే సుశీల్ కుమార్ సింగ్ ఈ నెలాఖరులో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నందున తాత్కాలిక డీఎంగా క్వాలిటీ కంట్రోల్ ఏజీఎం రతీశ్‌చంద్రన్‌కు అప్పగించారు. వరుణ్‌కుమార్ సూద్ నల్లగొండలో 2022 ఏప్రిల్ నుంచి బాధ్యతలు నిర్వహించారు.



సుశీల్ కుమార్ సింగ్

# 23న వైకుంఠ ఏకాదశికి ముస్తాబు

- గుట్టలో రెండోసారి స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి ఈఓ రామకృష్ణారావు



వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ముందు ఏర్పాటు చేసిన గ్రిల్స్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 21 : వైకుంఠ ఏకాదశి వేడుకలకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాలను అధికారులు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 23న ఉదయం 6.48గంటలకు యాదాద్రి ప్రధానాలయంలో స్వామి వారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు. పాతగుట్ట (పూర్వగిరి) లక్ష్మీనారసింహ స్వామి వారు ఉత్తర రాజగోపురం గుండా 6.48గంటలకు వైకుంఠనాథుడి దర్శనం ఇవ్వనున్నాడు. స్వామివారి అధ్యయనోత్సవాలను 23నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

# మళ్లీ కరోనా.. కాస్త జాగ్రత్త!

- ప్రమాదకరంగా మూడో వేరియంట్
- కొత్తరకం వైరస్‌తో ఊపిరితిత్తులపైనే ప్రభావం
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ..
- ఆర్‌టీపీసీఆర్ కిట్లు, మాస్కులు, శానిటైజర్లపై దృష్టి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

నీలగిరి, డిసెంబర్ 21 : ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తున్నది. రెండు వేరియంట్లకు మించి ప్రమాదకరంగా మూడో వేరియంట్ వస్తున్నది. తాజాగా కేరళలో జేఎన్–1 బీఏ 2.86 ఉపరకం పేరుతో కరోనా వేగంగా వ్యాప్తి చెందుతున్నది. అసలే శీతాకాలం కావడంతో మూడో వేరియంట్ ప్రధానంగా ఊపిరితిత్తులపైనే ప్రభావం చూపిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఈ వేరియంట్‌తో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. గత రెండు వేరియంట్లతో జిల్లాలో 1,107 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది ఆస్పత్రుల పాలయ్యారు. ఈ సీజన్‌లో అయ్యప్పమాలలు, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగ, వివిధ రకాల జాతరలు రానుండడంతో వైరస్ మరింత విస్తరించే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించడంతోపాటు శానిటైజర్లు వాడాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేసేందుకు కిట్లతోపాటు శానిటైజర్లు, మాస్కులు అందుబాటులో ఉంచేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.



### దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి



బీపీ, షుగర్, క్యాన్సర్ ఉన్నవారు తగిన జాగ్రత్తలు పాటించాలి. అవసరమైతే తప్ప బయటకి రాకూడదు. ముఖ్యంగా టీబీ, ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు తప్పకుండా మాస్కులు ధరించాలి. చిన్నారులు, వృద్ధుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి పౌష్టికాహారం తీసుకోవాలి. కేరళ నుంచి వచ్చే వారితో జాగ్రత్తగా ఉండాలి. ఏ క్షణమైనా నూతన వేరియంట్ వ్యాపించే అవకాశం ఉంది. రద్దీ ప్రదేశాల్లో సాధ్యమైనంతవరకు తిరుగకుండా ఉండాలి. జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

–డాక్టర్ అన్నీమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ, నల్లగొండ

### ప్రమాదకర వైరస్

కరోనాతో గతంలో రెండుసార్లు ప్రజలు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఈ వైరస్ నాటి రోజులు కండ్ల ముందు కదలాడుతుండగానే మరోసారి ప్రమాదకరమైన వైరస్ రిటర్న్ అయింది. ఏడాది నుంచి తన ప్రభావం చూపని కొవిడ్ మళ్లీ చాప కింద నీరులా విస్తరిస్తున్నది. గతంలో రెండు దఫాలుగా కరోనా చూపిన ప్రభావంతో వేలాది మంది మృత్యువాత పడగా, అంతకు మించిన సంఖ్యలో ప్రజలు దవాఖానల పాలయ్యారు. ఫలితంగా ఆరోగ్యపరంగా, ఆర్థికంగా చితికిపోయారు. ఇప్పుడిప్పుడే ప్రజలు కోలుకుంటున్న క్రమంలో మరోమారు కరోనా హెచ్చరికలు రావడంతో ప్రజల్లో ఆందోళన కనిపిస్తున్నది. ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తే జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. దాంతో శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. తద్వారా ఊపిరితిత్తులు ఇన్‌స్పెక్షన్‌కు గురై ప్రాణాపాయం ఏర్పడుతుంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో చలి తీవ్రత అధికంగానే ఉంది. దాంతో మనుషులపై అధిక ప్రభావం చూపించనున్నది. ఈ నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిందిగా వైద్యాధికారులు పేర్కొంటున్నారు. అయ్యప్పమాలలు, ధనుర్వాస పూజలు, క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి వేడుకలకు తోడు కొత్త సినిమాల విడుదల, వివిధ జాతరలు జన సామర్థ్యం పెంచేవే కావడం గమనార్హం. కరోనా వైరస్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ఇప్పటికే ప్రజలందరికీ ఈ వైరస్‌పై పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. ఈ ప్రమాదకర వైరస్‌తో ఇతర అనారోగ్య సమస్యలనూ ఇప్పటికే చాలా మంది అనుమభవిస్తున్నారు. ఈ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా రెండుసార్లు వ్యాక్సినేషన్‌తో పాటు బూస్టర్ డోస్‌ను కూడా అందించింది. అలాగే కరోనా పరీక్షలు నిర్వహించింది. గతంలో జిల్లాలోని అన్ని దవాఖానల్లో చికిత్సలు కూడా అందించింది. ప్రస్తుతం అన్ని దవాఖానల్లో బెడ్లను అందుబాటులో ఉంచడంతోపాటు ఆర్టీపీసీఆర్ కిట్లను కూడా సిద్ధం చేస్తున్నారు. కరోనా లక్షణాలు కనిపించిన వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శాంపిళ్లు అందించాలని వైద్యాధికారులు చెబుతున్నారు. కరోనా లక్షణాలు ఉన్న వెంటనే శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించేందుకు తగిన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది.